

గిరిజన గ్రామాల్లో యాంటీ లార్వల్ ఆపరేషన్

సీతంపేట రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి):మలేరియా దోమల నివారణలో భాగంగా సోమవారం పనసగూడ గ్రామంలో యాంటీలార్వల్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ప్రక్రియను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. దోమల పిల్లలు వృద్ధి చెందకుండా డ్రైఫ్రూ బెంజిరాన్ అనే రసాయనాన్ని వినియోగించినట్లు డీఎంవో సత్యనారాయణ వివరించారు. మలేరియా నివారణకు ప్రత్యేక పద్ధతులు అవలంబించాలని పీవో వైద్య సిబ్బందికి సూచించారు. సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు, టెక్నికల్ సూపర్‌వైజర్ ఝాన్సీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

50 శాతం కూడా పూర్తికాలే!


భామినిలో పైపులైన్ పనులు చేపడుతున్న దృశ్యం


ఉల్లిభద్రలో నీరివ్వని కుళాయిలు

- ఇదీ జిల్లాలో జలజీవన్ మిషన్ పనుల తీరు
- కొన్నిచోట్ల అర్ధాంతరంగా నిలిచిన వైనం
- గత వైసీపీ ప్రభుత్వ తీరుతో చెల్లింపు కాని బిల్లులు
- ఆగుతూ.. సా...గుతున్న నిర్మాణాలు
- దిష్టిబొమ్మల్లా మారిన కుళాయిలు
- ప్రజలకు అందని తాగునీరు
- పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

పార్వతీపురం, జూలై28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలజీవన్ మిషన్ పనులకు మోక్షం లభించడం లేదు. ఏళ్ల గడుస్తున్నా నిర్మాణాలు కొలిక్కిరావడం లేదు. చాలాచోట్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోగా.. మరికొన్నిచోట్ల పూర్తయినా తాగునీరు సరఫరా కావడం లేదు. కుళాయిలు దిష్టిబొమ్మల్లా మారాయి. దీంతో గిరిజన , మైదాన ప్రాంతవాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల జవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే జిల్లాలో పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. గత ఐదేళ్ల నుంచి పనులు కొనసా.. గుతూనే ఉన్నాయి. గతంలో చేపట్టిన నిర్మాణాలకు వైసీపీ సర్కారు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడం.. కేంద్రం మంజూరు చేసిన నిధులను పక్కదారి పట్టించడం తదితర కారణాలతో మన్యంలో జేజేఎం పనులు పూర్తికావడం లేదు. కాగా వాటి నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో సుమారు రూ.288 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించారు. ఇందులో 588 పనులు పూర్తి కాగా 624 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 486 టెండర్ దశలో ఉన్నాయి. 315 పనులకు టెండర్లు పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించలేదు. రూ.15 కోట్ల వరకు బిల్లులు అప్‌లోడ్ చేసినప్పటికీ చెల్లింపులు జరగలేదు. జిల్లాలో లక్షకు పైగా కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటివరకు 46,984 కుళాయిలు ఏర్పాటు చేయగా.. రూ.47 కోట్లు వెచ్చించారు. మరో రూ.50 కోట్ల పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉందని ఆర్ డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ప్రభాకరరావు తెలిపారు. రూ.15 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

నత్తనడకన..

సీతంపేట రూరల్: సీతంపేట మన్యంలో సర్వే నిర్వహించి 326 గ్రామాలను గుర్తించారు. అప్పట్లో రూ.16.59కోట్లు కేటాయించారు. అయితే జేజేఎం పనులు నత్తనడకన సాగుతుండడంతో గిరిజనులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాదికి జేజేఎం పనులు పూర్తిచేయాల్సి ఉండగా.. మరో తొమ్మిది నెలలు గడువు పొడిగించారు. మొత్తంగా 169 పనులు పూర్తయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యం తెలిపారు. వచ్చే ఏడాదికి అన్ని గిరిజన గ్రామాలకు తాగునీరు అందిస్తామని చెప్పారు.

- భామిని: సింగిడి గ్రామంలోని కొనసాగుతున్న జేజేఎం పనులకు వంశధారకు వరదనీరు అడ్డంకిగా మారింది. ఈ ఏడాది జూన్ 15లోగా పూర్తి చేయాలని గడువు విధించినా.. వాతావరణం అనుకూలించికపోవడం, తాజాగా వంశధారలో నీటి ప్రవాహం పెరగడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు గత ఏడాది రూ.60 కోట్లు మంజూరు చేశారు. 54 గ్రామాలకు సంబంధించి 72 కిలోమీటర్లు ద్వారా పైపు లైన్లు వేసి తాగునీరు సరఫరా

(మిగతా 8వ పేజీలో...)


ఏగోటివలసలో పిచ్చి మొక్కల మధ్య తాగునీటి సరఫరా పైపులు

పైప్‌లైన్ వర్క్‌లు జరగక..

సీతానగరం: నిధులున్నా పెదభోగిలి పంచాయతీ బుడ్డిపేట, గుచ్చిమి గ్రామాల్లో సకాలంలో జేజేఎం పనులు చేపట్టలేదు. దీంతో గ్రామస్థులు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. అరకొరగా నిధులు మజూరు కావడంతో చాలాచోట్ల పైప్‌లైన్ వర్క్‌లు సరిగ్గా జరగలేదు. ఈ నేపథ్యంలో లక్ష్మీపురం, జానుమనివలస, పణుకుపేట, ఏగోటివలస గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరందడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా గుచ్చిమి, బుడ్డిపేట గ్రామాల్లో పనులు త్వరలో జరిపిస్తామని, నిధులు అరకొరగా మంజూరైన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామని వెల్లడించారు.

మావోయిస్టు వారోత్సవాలు ప్రారంభం

- తూర్పు కనుమలను జల్లెడపడుతున్న ఇరు రాష్ట్రాల దళాలు
- ఏజెన్సీలో ప్రముఖుల పర్యటనపై డేగ కన్ను

సాలూరు రూరల్, జూలై 28: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒడిశా ప్రాంతం నుంచి వచ్చి పోయే వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్లలో భద్రతను కూడా పెంచారు. వాస్తవంగా ఛత్తీస్‌గఢ్, ఏవోబీలో మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ నేపథ్యంలో క్యాడర్‌లో ఆత్మస్థైర్యం నింపడానికి వచ్చేనెల మూడో తేదీ వరకు వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి మావోయిస్టులు యత్నిస్తున్నారు. అమరవీరుల వర్ధంతుల నేపథ్యంలో విప్లవ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇరురాష్ట్రాల సాయుధ దళాలు ఏవోబీ అడవులను జల్లెడపడుతున్నారు. ఎక్కడా ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు ప్రత్యేక కార్యాచరణతో పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. జిల్లాలో ఏజెన్సీ పోలీస్‌స్టేషన్లు, ప్రముఖుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రముఖ రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధి కారులు ఏజెన్సీలో పర్యటనలు చేయొద్దని పోలీసులు సమాచార మిచ్చారు. ఏజెన్సీకి ప్రాంతా లకు వెళ్లాల్సి వస్తే ముందస్తు సమాచారం అందించాలని సూచిం చారు. మరోవైపు ప్రభుత్వ ఆస్తులకు భద్రత కల్పిస్తున్నారు.


కొమరాడలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

కొమరాడ/గుమ్మలక్ష్మీపురం: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో సోమవారం పోలీసులు పటిష్ఠ భద్రత చర్యలు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏజెన్సీ సరిహద్దు ప్రాంతాల్లో రాత్రి, పగలని తేడా లేకుండా విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు.

ప్రత్యేక కూంబింగ్

'ఏవోబీలో సరిహద్దు ప్రాంతాలైన మక్కువ, పాచిపెంట, సాలూరు మండలాలు, అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక దళాలతో కూంబింగ్ నిర్వహిస్తున్నాం. వాహన తనిఖీలు, రోడ్ ఓపెన్, ఏరియా డామినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఏజెన్సీలో పర్యటించరాదని సూచించాం. ఏజెన్సీలో ఉన్న రాజకీయ నాయకులు సైతం సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం మంచిది. ఏజెన్సీలో పర్యటనలకు వెళ్లే వారు సమాచారమిస్తే తగిన భద్రత చర్యలు తీసుకుంటాం.' అని సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు.

ఒకే వ్యక్తి పేరిట 13 జిల్లాల్లో

విద్యుత్ మీటర్లు

- 'తల్లికి వందనం' పథకానికి నోచని ముగ్గురు పిల్లలు

బెలగాం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అధికారుల తప్పిదాలు పేదలకు శాపంగా మారుతున్నాయి. సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నాయి. ఒకే వ్యక్తి పేరిట 13 జిల్లాల్లో విద్యుత్ మీటర్లు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపించడంతో ఓ కుటుంబంలో ముగ్గురు పిల్లలు 'తల్లికి వందనం' పథకానికి నోచు కోలేదు. వివరాల్లోకి వెళ్తే.. పార్వతీపురం వివేకా నంద కాలనీలో ఓ అద్దె ఇంటిలో సబ్బవరపు శ్రీను, రమాదేవి దంపతులు నివసిస్తున్నారు. వారికి ముగ్గురు సంతానం. అచ్యుత (8వ తరగతి), దీక్షిత (6వ తరగతి), గీత (3వ తరగతి) చదువుతున్నారు. అయితే 'తల్లికి వందనం' పథకం వారికి వర్తించలేదు. దీంతో రమాదేవి సచివాలయానికి వెళ్లి అడగ్గా.. ఆమె భర్త పేరు మీద 13 జిల్లాలో విద్యుత్ మీటర్లు ఉన్నట్లు చూపిస్తుందని అక్కడున్న సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి


భర్త పేరు మీద ఉన్న విద్యుత్ కనెక్షన్లు చూపుతున్న రమాదేవి

(మిగతా 8వ పేజీలో...)

ఓఆర్ఎస్‌తో ఆరోగ్యం

- అతిసారం నుంచి రక్షణ
- శరీరంలో నీటి శాతం పెంపునకు దోహదం
- నేడు ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవం



విజయనగరం రింగురోడ్డు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఓఆర్ఎస్.. ఆపదలో ఆరోగ్యాన్ని కాపాడే దివ్యమైన ఔషధం. అతిసారం, వాంతులు వంటివి ప్రబలినప్పుడు శరీరం కోల్పోయిన నీరు, లవణాలను తిరిగి అందిస్తుంది. శరీరానికి తగినంత నీరు అందకపోతే డీహైడ్రేషన్‌కు గురవుతాం. తద్వారా అవయవాలు సరిగా పనిచేయక అనారోగ్యం బారిన పడతాం. ఇటువంటి సమయంలో ఆరోగ్యానికి రక్షణ కల్పించేందుకు ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్స్) సంజీవనిలా పనిచేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు ఓఆర్ఎస్‌పై అవగాహన పెంచేందుకు ఏటా జూలై 29న ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇంట్లో తక్కువ ఖర్చుతోనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారుచేసుకోవచ్చని, తద్వారా శరీరంలో నీటిశాతం పెరిగి ఆరోగ్యంగా ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఓఆర్ఎస్ అనేది చక్కెర, ఉప్పు, నీరు కలిసిన మిశ్రమం. ఇది డీహైడ్రేషన్ బారి నుంచి కాపాడుతుంది. శిశువుల ఆరోగ్యం, వారి శ్రేయస్సుకి అమృతంలా పనిచేస్తుంది. పిల్లల మరణాలు తగ్గించడం, తల్లి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, వ్యాధులను ఎదుర్కోవడంలో దోహదపడుతుంది. 1960 తర్వాత ఓఆర్ఎస్ ప్రాముఖ్యతను యూని సెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల మేరకు ఐదేళ్లలోపు పిల్లల మరణాలకు అతిసారం.. సంబంధిత వ్యాధులే కారణం. ఏటా ప్రపంచ వ్యాప్తంగా 1.7 బిలియన్ల మంది పిల్లలను అతిసారం ప్రభావితం చేస్తోంది. డయేరియా కారణంగా డీహైడ్రేషన్ తో ఏటా 5.25లక్షల మంది చిన్నారులు చనిపోతున్నారని డబ్ల్యూ హెచ్‌వో ధ్రువీకరించింది. ఓఆర్ఎస్ ద్రావణం తాగితే.. డీహైడ్రేషన్‌ను నిరోధిస్తుంది. రెండేళ్ల లోపు చిన్నారులకు



(మిగతా 8వ పేజీలో...)

అభివృద్ధే కూటమి లక్ష్యం
- మంత్రి సంధ్యారాణి
8లో

నిరసనల హోరు
- ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల డిమాండ్
8లో

20లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి
- విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్
6లో


6లో

అప్పుడప్పుడూ కలకలం
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

ఉన్నవి సరిపోవు.. కొత్తవి పూర్తికావు
- ఇదీ పాఠశాలల దుస్థితి
- విద్యార్థులకు ఇబ్బందులు


6లో

ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు : కలెక్టర్

పార్వతీపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. 'వేడుకల నిర్వహణకు అనువైన ప్రదేశాలు ముందుగా గుర్తించాలి. గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు నిర్వహణ కమిటీలను నియమించాలి. ఆదివాసీల విలువిద్య, సంప్రదాయ వస్తువులు, పనిముట్లు ఇతర సామగ్రి ప్రదర్శించేలా ఒక మ్యూజియం, గిరిజనుల దుస్తులతో ఫొటోలు తీసుకునేలా సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలి. వివిధ శాఖల ద్వారా గిరిజన లబ్ధిదారులకు భూ పట్టాలు, ఉపకరణాలు, చెక్కులు వంటివి పంపిణీ చేయాలి.' అని తెలిపారు.


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

స్వచ్ఛందంగా దత్తత తీసుకోవాలి

స్వచ్ఛందంగా మార్గదర్శులు ముందుకొచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మార్గదర్శుల ఎంపికకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని, దానిని తప్పకుండా పాటించాలని అధికారులకు సూచించారు. మార్గదర్శులకు తలెత్తే సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో హేమలత, ప్రత్యేక ఉపకలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలు తగ్గలే!

- రోగులతో కిక్కిరిసిన సీతంపేట ఆసుపత్రి
- ఓపీ సంఖ్య 320

సీతంపేట రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో జ్వరాలు ఇంకా తగ్గుముఖం పట్టడం లేదు. వైరల్ ఫీవర్లు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. సీతంపేట ఏరియా ఆసుపత్రి సోమవారం జ్వరపీడితులతో కిక్కిరిసింది. 320 వరకు ఓపీ నమోదైంది. వారిలో 100 మంది వరకు టైఫాయిడ్, విష జ్వరాల బాధితులు ఉన్నారు. ఆర్‌డీటీ రక్త పరీక్షల్లో 16 మలేరియా పాజిటివ్ కేసులు నమోదవగా, స్లైడ్ పరీక్షలో ఒక కేసు పాజిటివ్ వచ్చింది. వారిలో 37 మంది వరకు ఏరియా ఆసుపత్రిలో చేరి వైద్యసేవలు పొందుతున్నారు. అయితే రోగులకు వసతి సమస్య వేధిస్తోంది. దీనిపై ఆసుపత్రి పర్యవేక్షకుడు బి.శ్రీనివాసరావు వివరణ కోరగా.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు.


సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

అప్పుడప్పుడూ కలకలం



'ఇదిగో ఈ తోటలో పులి అడుగు జాడలు. అదిగో పొలాల్లో పులి పాదముద్రలు. అదేదో ఊరిలో ఆవును చంపేసిందట...' ఇదీ మూడేళ్ల కిందట ఉమ్మడి జిల్లాలో పులి సృష్టించిన అలజడి. ఎక్కడి నుంచి వచ్చిందో.. ఏ వైపు నుంచి వచ్చిందో ఎవరికీ తెలియదు. పులి పాదముద్రలు కనిపించేవి తప్ప... ప్రత్యక్షంగా చూసిన వారు లేరు. తమ గ్రామ పరిసరాల్లో సంచరించిందని ఒకరు చెబితే.. తమ తోటలో కనిపించిందని మరొకరు చెప్పేవారు. ఎస్.కోట, మెంటాడ, బొండపల్లి, గంట్యాడ, మెరకముడిదాం, కొత్తవలస ఇలా వివిధ మండలాల్లో కొన్ని నెలల పాటు పులి సంచారం వార్తలు కలకలం సృష్టించాయి. కొన్నాళ్ల తరువాత అది ఎటు వెళ్లిందో జాడ లేకుండా పోయింది. దీంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

- ఉమ్మడి జిల్లాలో మూడేళ్ల కిందట పులి సంచారం
- పాదముద్రలను గుర్తించిన అధికారులు
- కొన్నిచోట్ల పశువులపై దాడి
- ప్రస్తుతం అంతా ప్రశాంతం
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

శృంగవరపుకోట, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పులుల ఆవాస ప్రాంతాలు లేవు. కానీ అప్పుడప్పుడు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి.. కొద్ది రోజుల తరువాత మాయమైన సంఘటనలు ఉన్నాయి. 2020 సంవత్సరం నుంచి 2022 వరకు పులి సంచారంపై వదంతులు ఎక్కువగా వినిపించాయి. కేవలం పులి పాదముద్రలను మాత్రమే అధికారులు గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసేవారు. దీనికి తోడు రెండు పులులు సంచరిస్తున్నాయనే వదంతులతో ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడిపేవారు. 2022 ఏప్రిల్ 25న రాత్రి విశాఖ-అరకు రోడ్డులో రాజీపేట దాటిన తరువాత తన కారుకు ఎదురుగా పులి వచ్చిందని ఎస్.కోటకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి వాట్సాప్‌లో ఓ వీడియో పెట్టారు. దీంతో ఆ రాత్రంతా స్థానికులకు నిద్ర కరువైంది. ఏప్రిల్ 26న ఉదయం శృంగవరపుకోట మండలం కృష్ణాపురం చెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసేందుకు వెళ్లిన కూలీలకు పులి పాద్రముద్రలు కనిపించాయి. వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఇలా ఒక రోజు మెంటాడ మండలంలో, మరొక రోజు బొండపల్లి మండల పరిధిలో, ఇంకొకరోజు గంట్యాడ మండలం డీకే పర్తి అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోందని ప్రచారం జరిగింది. అదే సమయంలో ఎస్.కోట మండలం కృష్ణాపురం శివారు భీమవరం పరిధిలోని పొలాల్లో ఉన్న గొర్రెల మందపై పులి దాడి చేసిందని, ఒక గొర్రెను చంపేసిందని, మరొక గొర్రెను ఎత్తుకుపోయిందని కాపరులు చెప్పారు. దీంతో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పులి సంచారం నిజమేనని వారు నిర్ధారించడంతో కొండ సమీపంలో ఉన్న వివిధ గ్రామాల ప్రజలంతా భయంతో వణికిపోయారు.

విజయనగరం జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంలో ఎక్కడా పులులు ఉన్నట్లు ప్రభుత్వం వద్ద లెక్కలేదు. జిల్లా ప్రజలను మూడేళ్ల పాటు భయపెట్టిన పులి ఎక్కడి నుంచి వచ్చిందో అటవీ శాఖ అధికారులు కచ్చితంగా చెప్పలేకపోయారు. పులి సంచరిస్తోందనడమే తప్ప.. దాన్ని ప్రత్యక్షంగా చూసిన వారు ఎవరూ లేరు. అధికారులు కూడా కేవలం పులి అడుగుజాడలను గుర్తించడం వరకే పరిమితమయ్యారు.

కొరమ సమీపంలో పాదముద్రలు

భామిని, జూలై 28(ఆంధ్రజ్యోతి): కొరమ సమీపంలో రెండేళ్ల క్రితం పెద్దపులి పాదముద్రలను అప్పటి అటవీ శాఖాధికారులు గుర్తించి ప్రజలను అప్రమత్తం చేశారు. 2023లో కొరమ ప్రాంతంలో వంశధార పనులు చేసే చోట వాచ్‌మేన్ పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. అధికారులు వచ్చి అవి పులి పాదముద్రలేనని నిర్ధారించారు. ఒక వైపు ఏనుగులు, మరో వైపు పులి సంచరించడంతో సాయంత్ర వేళల్లో రాకపోకలకు ప్రజలు భయపడ్డారు. ఆ తర్వాత దాని జాడ కనిపించలేదు. ప్రస్తుతానికి మన్యం జిల్లాలో పులి భయం లేదని పాలకొండ ఫారెస్ట్ రేంజర్ రామారావు తెలిపారు.

కొత్తవలసలో..

కొత్తవలస, జూలై 28(ఆంధ్రజ్యోతి): గులివిందాడ, గనిశెట్టిపాలెం, దెందేరు, సంతపాలెం, చీడివలస, రామలింగపురం, సుందరయ్యపేట గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో 2020-21 మధ్య పులి సంచారం ఎక్కువగా ఉండేది. అప్పట్లో కల్లాల్లో రైతులు కట్టిన ఆవులు, దూడలను చంపేయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పులి జాడను కనుగొనేందుకు అటవీ శాఖాధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయినా, పులి కదలికలు అందులో రికార్డు కాలేదు. చివరిసారిగా గులివిందాడ గ్రామ పరిసరాల్లో పులి పాదముద్రలను అధికారులు గుర్తించారు. ఆ తరువాత దాని జాడ కనిపించలేదు.

బోను పెట్టినా చిక్కలేదు..

మెరకముడిదాం, జూలై 28(ఆంధ్రజ్యోతి): షికారుగంజి అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న పులిగుమ్మి గ్రామంలో మూడేళ్ల కిందట పులి సంచరించింది. పులి దాడిలో మూడు ఆవులు మృతిచెందగా, రెండు ఆవులు గాయాలపాలయ్యాయి. అప్పట్లో అటవీశాఖాధికారులు పులిని పట్టుకునేందుకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో బోన్లు సైతం ఏర్పాటు చేశారు. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరికి పులిని పట్టుకోలేకపోయారు. కదలికలను బట్టి అది బెంగాల్ టైగర్‌గా గుర్తించారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా దాని జాడ కనిపించలేదు.

మేం చూశాం

షికారు గంజి అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న మా గ్రామంలో మూడేళ్ల కిందట పులి సంచరించింది. పశువులపై దాడిచేసి చంపేసింది. పలుమార్లు నాతోపాటు గ్రామస్థుల కంటపడింది. పులిని పట్టుకునేందుకు అటవీ శాఖాధికారులు బోనును ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

- తలచుట్ల ఈశ్వరరరావు, పులిగుమ్మి, మెరకముడిదాం మండలం

ఏవోబీ సరిహద్దుల్లో..

పార్వతీపురం/పార్వతీపురం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏవోబీ సరిహద్దుల్లో పార్వతీపురం మండలానికి ఆనుకొని ఉన్న కొరాపుట్ జిల్లా అలమండ సమీపంలో ఉన్న గడ్డ వరకు పులులు వచ్చేవని చెబుతారు. కానీ ఎవరికీ ప్రాణహాని జరిగిన సంఘటనలు లేవు. ఏవోబీ సరిహద్దులోని కొరాపుట్ జిల్లా అలమండ, నీలావడి, బందుగాం తదితర ప్రాంతాల్లో పులులు ఉండేవని ఆ ప్రాంతంతో సంబంధం ఉన్న కొంతమంది వృద్ధులు చెబుతారు. ప్రస్తుతం ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలోనే పులుల సంచారం ఉందని.. పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు ఈ ప్రాంతంలో పులుల సంచారం లేదని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా పులులు సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందని చెప్పవచ్చు. సుమారు రెండేళ్ల కిందట డోకిశిల పంచాయతీ పరిధిలో ఉన్న కొయ్యమెట్టవలస గ్రామంలో ఒక ఆవును పులి చంపింది. మెల్లికువలస, గంజిగడ్డ తదితర గ్రామాల్లో సంచరించింది. ఆ తరువాత ఈ ప్రాంతంలో పులుల కదలికలు లేవు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): పులి సంచారంతో 2022 ఆగస్టులో మండలంలోని కొన్ని గ్రామాల్లో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. కన్నాం గ్రామంలో 2022 ఆగస్టు 5న పులి సంచరించడం కలకలం సృష్టించింది. చుక్క సత్యం అనే వ్యక్తికి చెందిన ఆవుపై దాడి చేసి గాయపరిచింది. స్థానికులు విషయాన్ని అటవీ అధికారులకు తెలియజేశారు. అప్పట్లో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ అప్పలరాజు ఆధ్వర్యంలోని బృందం పులి ఈ ప్రాంతంలో సంచరించినట్లు నిర్ధారించారు. ట్రాప్ కెమెరాలు, బోనులు ఏర్పాటు చేసినప్పటికీ చిక్కలేదు. ఎస్.చింతలవలస గ్రామంలో పులి పంజాకు ఆవు బలైంది. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. షికారుగంజి, రామచంద్రాపురం, ఇంగిలాపల్లి, మర్రివలస, గ్రామ సమీపాల్లో పులి సంచరించినట్టు ఫారెస్టు అధికారులు తెలిపారు. కానీ పులి జాడ మాత్రం దొరకలేదు.

భయబ్రాంతులకు గురయ్యాం

పులి సంచారంతో బిక్కుబిక్కుమంటూ గడిపాం. మూగజీవాలపై దాడిచేసి వాటిని బలి తీసుకోవడంతో ఆందోళనకు గురయ్యాం. ప్రజలు సాయంత్ర వేళల్లో బయటకు వచ్చేందుకు భయపడేవారు. అటవీ శాఖాధికారులు విశ్వప్రయత్నం చేసినప్పటికీ పులి చిక్కలేదు.

- చుక్క సన్యాసినాయుడు, కన్నాం గ్రామ సర్పంచ్, దత్తిరాజేరు మండలం

రెండేళ్ల కిందట అలజడి

సాలూరు రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో 2022, 2023 సంవత్సరాలలో రెండు పులులు సంచరించాయి. సాలూరు పట్టణంతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఓ పులి సంచరించింది. జగ్గుదొరవలస, మారయ్యపాడు, మిర్తివలస, తుపాకీవలస, రెయ్యివానివలస తదితర గ్రామాల్లో 2022 సెప్టెంబర్ 16, 17, 18 తేదీల్లో జనాన్ని భయభ్రాంతులకు గురిచేసింది. మారయ్యపాడు పొలిమేరలో 2022 సెప్టెంబర్ 17న పొట్టంగి తవిటయ్యకు చెందిన రెండు ఆవులు, ఒక దూడను చంపేసింది. సంఘటన స్థలంలోని పాదముద్రల ఆధారంగా అప్పటి సాలూరు రేంజర్ కె.రామారావు తదితరులు పరిశీలించారు. దాన్ని రాయల్ బెంగాల్ టైగర్‌గా నిర్ధారించారు. అదే ఏడాది నవంబర్ 27న పార్వతీపురం మండలం బుచ్చింపేట వద్ద బి.శంకరరావుకు చెందిన మేకను పులి హతమార్చింది. సాలూరు పట్టణ పరిధిలోని గుమడాం వద్ద రాంప్రసాద్ తోటలో దూడను చంపింది. అనంతరం ఒడిశాలోని నారాయణపట్న బ్లాక్‌లో పలు పశువులను పొట్టన పెట్టుకుంది. మళ్లీ డిసెంబర్‌లో పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లో సంచరించింది. రెండు పులులు ఉన్నాయని అప్పటి ఉమ్మడి జిల్లా ఎఫ్‌వో శంబంగి వెంకటేష్ చెప్పారు. అలెప్పి, బొండపల్లి, కోటపాడు, కొత్తపనసలపాడులో పులల కోసం బోనులు ఏర్పాటు చేసినా ఫలితం కనిపించలేదు. ఆ తర్వాత అవి ఏమయ్యాయో తెలియరాలేదు.



పులి దాడిలో మరణించిన ఆవును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

వాన ముంచేసింది



పొలాల్లో నీట మునిగిన పంట

సంతకవిటి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం దశలోనే వర్షాలు కురుస్తుండడం... మడ్డువలస, నారాయణపురం ప్రాజెక్టుల నీరు విడిచిపెట్టడంతో వరి పండించేందుకు ఇబ్బంది ఉండదని రైతన్నలు సంతోషించారు. కానీ పొలాలు నీట మునగడంతో ఆందోళన చెందుతున్నారు. మల్లయ్యపేట, రామారాయిపురం గ్రామాల వద్ద ఏటా సాయన్న గెడ్డ వరద ప్రవాహం వల్ల పంట పొలాలు నీట మునిగేవి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూడికతీత పనులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ ఏడాది పూడికతీత పనులు ప్రారంభించారు. అయినప్పటికీ మల్లయ్యపేట, రామారాయిపురం గ్రామాల రైతులు వరి నారు నీట మునగడంతో తల్లడిల్లుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాలు కనికరించాయనుకుంటే... ఇలా ముంచేస్తాయనుకోలేదని తల్లడిల్లుతున్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- 'మీకోసం'లో 165 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్ అధికారులకు స్పష్టం చేశారు. సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వివిధ సమస్యలపై 165 వినతులు వచ్చాయి. ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, వెంకటేశ్వరరావు, ప్రమీలా గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలకు సంబంధించి 70 వినతులు, పంచాయతీ రాజ్ శాఖవి 9, డీఆర్‌డీఏవి 23, మున్సిపాల్టీకి 11, విద్యా శాఖకు 8, వైద్య శాఖకు 6, విద్యుత్ శాఖకు 6 చొప్పున, మిగిలినవి ఇతర శాఖలవి ఉన్నాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు.

ఇంటి పన్ను వేయడానికి అంగీరించలేదు

'నా తల్లి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌కు ఇంటి పన్ను వేయాలని పీజీఆర్‌ఎస్‌లో విన్నవించుకున్నాను. మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. ఈ సమస్యను జేసీ దృష్టి తీసుకుని వెళ్లాను. దీనిపై మున్సిపల్ అధికారులకు జేసీ చెప్పారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఇంటి పన్ను వేయాల'ని విజయనగరం పట్టణంలోని ఫూల్‌బాగ్ పరిధిలో గల హనుమాన్ నగర్‌కు చెందిన యూఎస్ఎస్ రామకృష్ణ కోరారు.

గిరిజనుల సమస్యలు పట్టించుకోలేదు

'జిల్లాలోని గిరిజనుల సమస్యలపై మంత్రి పట్టించుకోవడం లేదు. రామభద్రపురం మండలం మిర్తివలస పంచాయతీలో గిరిజనులు సాగు చేసుకున్న భూముల్లో ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పంట నాశనం చేశారు. అదేమని అడిగితే ఆ భూమిని 2017లో ఎంఎస్ఎంఈ పార్క్‌కు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఎస్.కోట మండలంలోని ముషిడిపల్లి పంచాయితీ బంద వలస గ్రామంలో కూడా ఏపుగా పెరిగిన జీడి, మామిడి చెట్లను తొలగించారు జిల్లాలోని గిరిజనులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా పట్టించుకోవడం లేదు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాల'ని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తుమ్మి అప్పలరాజు దొర కోరారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించండి

- ఎస్పీ వకుల్ జిందాల్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం దాసన్నపేట, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్‌ల పరిధిలో బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 44 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత ఫిర్యాదులపై పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సమస్యలను వివరించి... చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 10, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్టు 4, ఇతర అంశాలకు సంబంధించి 26 ఫిర్యాదులు ఉన్నాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలన్నారు. వాటి పూర్వాపరాలపై విచారణ చేసి ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్టయితే, చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులను ఏడు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, సుధాకర్, ఎస్ఐ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

- మన్యం ఎస్పీ మాధవరెడ్డి



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్పీ 8 వినతులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఆయన స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీబీ ఎస్ఐ ప్రక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి కారకాలపై దృష్టి సారించాలి



వివరాలు తెలుసుకుంటున్న జగన్మోహనరావు

సీతానగరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు రోగాలబారిన పడడానికి గల మూల కారకాలపై దృష్టి సారించాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. సోమవారం లక్ష్మీపురంలో జరుగుతున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. కొద్ది రోజులుగా గ్రామంలో పలువురికి అనారోగ్య లక్షణాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్య సేవలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే డీఎం అండ్ హెచ్‌వో సందర్శించి వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారన్నారు. నిర్ధారణ పరీక్షల నివేదికల్లో ఎక్కడా మలేరియా, డెంగ్యూ జ్వరాలు నమోదు కాలేదన్నారు. తాగునీటి స్వచ్ఛత పరీక్షల వివరాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే చేపడుతూ లక్షణాలు గుర్తించిన వారికి తగు చికిత్స అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హరిప్రియ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నవి సరిపోవు.. కొత్తవి పూర్తికావు

- ఇదీ పాఠశాలల దుస్థితి
- విద్యార్థులకు ఇబ్బందులు

వీరఘట్టం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు సరైన తరగతి గదులు లేక అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు ఫేజ్-2 కింద అదనపు గదుల పనులు ప్రారంభించారు. కానీ పూర్తి కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇంకా వీటిపై దృష్టి పెట్టినట్టు లేదు. ఫలితంగా ఉన్న గదుల్లో ఇరుకిరుగా కూర్చుంటూ చదువుతున్నారు. కొన్నిచోట్ల శిథిల భవనాలే దిక్కవుతున్నాయి. మండలంలోని 29 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టారు. దీని కోసం రూ.9 కోట్ల 83 లక్షల 13 వేలు కేటాయించారు. కానీ నేటి వరకు రూ.మూడు కోట్ల 51 లక్షల 44 వేలు మాత్రమే విడుదలయ్యాయి. మిగిలిన నిధులు రాకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. రేగులపాడులో ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 270 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ప్రస్తుతం ఆరు తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉండడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదనంగా మంజూరైన 8 తరగతి గదుల పనులు పూర్తయితే ఇబ్బందులు తొలుగుతాయి. అధికారులు చొరవ తీసుకొని నిర్మాణ పనులను పూర్తి చేయాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఇంజనీరింగ్ అధికారి రామకృష్ణంనాయుడు వద్ద ప్రస్తావించగా, అసంపూర్తి పాఠశాల భవనాల వివరాలను ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తామని చెప్పారు.



రేగులపాడు కేజీబీవీలో ఇలా..



నీలానగరంలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు

20లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి

- రాష్ట్ర మంత్రి రవికుమార్

భోగాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పోలిపల్లి గ్రామంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా 20 లక్షల కనెక్షన్లు వచ్చాయని చెప్పారు. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అంతకుముందు మంత్రులు, నాయకులు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, విశాఖ నార్త్ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు నజీర్, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, ఆకిరి ప్రసాదు, కడగల ఆనంద్‌కుమార్, కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, గేదెల రాజారావు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కె.శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు తదితరులు

చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్రకు ప్రాధాన్యం

చీపురుపల్లి, జులై 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలోనే ఉత్తరాంధ్ర ప్రత్యేక గుర్తింపు పొందిందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన నాయకులంటే చంద్రబాబుకు ఎనలేని విశ్వాసమన్నారు. అందువల్లే ఉత్తరాంధ్రకు చెందిన నాయకులను రాజకీయంగా ఆయన ఎంతో ప్రోత్సహించారన్నారు. తోటపల్లి, నాగావళి, బహుదా, తారకరామ ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు నీరందించడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, వెంపడాపు లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహానికి ప్రహరీ నిర్మించండి

శృంగవరపుకోట, జూలై 28(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట గిరిజన కళాశాల బాలికల వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వసతిగృహం నుంచి ర్యాలీ చేశారు. దేవిబొమ్మ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చిన్నబాబు, కమిటీ సభ్యులు భారతి, రత్న, అనిత పాల్గొన్నారు.

30న ఏఎంసీ పాలకవర్గ బాధ్యతల స్వీకరణ

విజయనగరం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఏఎంసీ పాలకవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఈనెల 30న మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని చైర్మన్ కర్రోతు నరసింగరావు చెప్పారు. పాలకవర్గ సభ్యులతో కలిసి ఏఎంసీ ప్రాంగణంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 30న ఉదయం 11.02 గంటలకు బాధ్యతల స్వీకరణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రినాయుడు, వేలిచేటి మణికుమారి, వర్రి సంతోషిణి, ఎం.దేవీశ్రీ, హూస్సేన్, సాగి సాయిరామరాజు, హూస్సేన్, చందక తాతీయ్యలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో భారం

రాజాం రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై కోట్లాది రూపాయల భారాన్ని మోపుతోందని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తినాయుడు ఆరోపించారు. ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాజయ్యపేటలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఆ జీవోలు రద్దు చేయాలి

ఎస్.కోట రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పంచాయతీల్లో 2008లో జిందాల్ కంపెనీ ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చిన జీవోలు అన్ని వెంటనే రద్దు చేయాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. సోమవారం బొడ్డవర గ్రామం వద్ద ఆందోళన చేశారు.

సమస్యల నమోదుపై హర్షం

ఎస్.కోట రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో గత 37 రోజులుగా జిందాల్ నిర్వాసితులు శాంతియుత నిరసన చేస్తున్నారు. ఈనేపథ్యంలో మండల రెవెన్యూ బృందం సోమవారం జిందాల్ నిర్వాసితులను కలిసి, వారి సమస్యలను అడిగి నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆర్ఐ మనోజ్ మాట్లాడుతూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళి ఆదేశాల మేరకు నిర్వాసితులను కలిసి, వారి సమస్యలు నమోదు చేశామని, వీటిని తమ ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. నిర్వాసితులు ఆనందం వ్యక్తంచేశారు.

రైతులకు న్యాయం చేసేందుకే...

శృంగవరపుకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసిత రైతులకు న్యాయం చేసేందుకే అప్పట్లో ఆ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరపకుండా నిలుపుదల చేశామని మాజీ ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, శోభా హైమావతి తెలిపారు. సోమవారం స్థానిక కల్యాణ మండపంలో వారు విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం నిర్వాసిత రైతుల సమస్యలను పరిష్కారం చూపిన తర్వాతే ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణ లక్ష్యాలు చేరుకోవాలి

రేగిడి, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణ, వసూళ్ల లక్ష్యాలు చేరుకోవాలని డీజీఎం పి.కృష్ణమూర్తి సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరుకు మండలంలో రూ.6కోట్లు రుణాలు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికి రూ.2.25 కోట్లు ఇవ్వటాన్ని గుర్తించి రుణ లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. రికవరీ శతశాతం ఉండడంతో సిబ్బందిని అభినందించారు. ఏపీఎం గోవిందరావు, స్త్రీనిధి రాజాం క్లస్టర్ మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు.

పుణ్య తిరుమల గిరిక్షేత్రంలో అభిషేకాలు

శృంగవరపుకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పుణ్య తిరుమల గిరి క్షేత్రంలో సోమవారం శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, ఎంపీటీసీలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి దంపతులు పూజలు చేశారు.

శిథిలావస్థలో వంట గదులు

- మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

గజపతినగరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): భూదేవిపేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన వంటశాల శిథిలావస్థకు చేరింది. దీంతో మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు ఎండీఎం నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేకుల షెడ్ కావడంతో పైకప్పునకు రంధ్రాలు ఏర్పడ్డాయి. అక్కడక్కడ విరిగిపోయింది. చిన్నపాటి వర్షానికి కారిపోతుంది. పాలకులు, అధికారులకు తెలయజేసినా పట్టించుకోవడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు. ఈ పాఠశాలలో 14మంది విద్యను అభ్యశిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



గజపతినగరం: భూదేవిపేటలో వంటశాల రేకుకు రంధ్రాలు ఏర్పడిన దృశ్యం



భోగాపురం: జగ్గయ్యపేటలో నిరుపయోగంగా మారిన వంటశాల

ఇంటి వద్దే వంట..

భోగాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సంబంధించి మధ్యాహ్న భోజనాన్ని ఎండీఎం నిర్వాహకులు వారి ఇంటి వద్దే తయారు చేస్తున్నారు. పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు 17 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఉన్న వంటశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎండీఎం నిర్వాహకులు ఇంటి దగ్గర వంట చేసి, పాఠశాలకు తీసుకొస్తున్నారు. ● దీనిపై హెచ్ఎం వీవీఎస్ఆర్ సీతారామమూర్తిని వివరణ కోరగా.. వంటశాల శిథిలం అయ్యిందని, పైఅధికారులకు నివేదిక అందజేశామని చెప్పారు.

డ్రైవర్లకు రూ.15వేలు ఇవ్వాలి

- సీఐటీయూ నాయకుల నిరసన



నిరసన చేస్తున్న ఆటో డ్రైవర్లు

విజయనగరం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు వాహన మిత్ర పథకంలో భాగంగా రూ.15వేలు అందించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడం వల్ల ఆటో, టాటా ఏసీ, మాక్సీక్యాబ్ వాహన డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలును తగ్గించాలని కోరారు.

సొంతభవనం మంజూరు చేయాలి

- రెడ్డివానివలస పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన



ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

విజయనగరం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ఉన్న పాఠశాలకు సొంత భవనం మంజూరు చేయాలని మెంటాడ మండలం రెడ్డివానివలస గ్రామస్థులు తమ పిల్లలతో కలిసి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ 1980లో పాఠశాల భవనం కూలిపోయిందని, ఇప్పటివరకూ భవనం ఏర్పాటు చేయలేదన్నారు. సొంత భవనం లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాము, శిరీష తదితరులు ఉన్నారు.

పథకాల అమలులో ముందంజ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

గరివిడి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. గదబవలస పంచాయతీ ఐతాంవలస గ్రామంలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అందించిన పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. టీడీపీ నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్, సత్యం మాస్టారు, దిండి రమేష్ పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల బలోపేతానికి చర్యలు



బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగార్జున

గరివిడి, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకుల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు. గరివిడి డీసీసీబీ బ్రాంచ్‌ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, కార్పొరేట్ స్థాయి బ్యాంకులకు దీటుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. డిపాజిట్లను మరింత పెంచడం ద్వారా రైతులకు వడ్డీ మొత్తాన్ని తగ్గించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. బ్రాంచ్‌లో వ్యాపార లావాదేవీలు పెంచాలని సూచించారు. బ్రాంచి మేనేజర్ జి.భారతి పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించేలా కృషి చేస్తాం

జామి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మూతపడిన భీమసింగి చక్కెర కర్మాగారం నుంచి కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. తమకు భీమసింగి చక్కెర కర్మాగారం నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించేలా చూడాలని ఆ కార్మాగారంలో పనిచేసిన కార్మికులు మంత్రిని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు ఆధ్వర్యంలో సోమవారం వారంతా మంత్రిని కలిసి, సమస్యను వివరించారు. వీలైనంత త్వరగా బకాయిలు చెల్లించేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కుమారాం మాజీ సర్పంచ్ సత్యనారాయణ, అట్టాడ జనార్దన్ పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌కు సమస్యను వివరిస్తున్న కార్మికులు

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం కలెక్టరేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హమాలీలు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. జిల్లాలోని 8 ఎంఎల్ఎస్ పాయింట్‌లలో సుమారు 200 మంది గత 30 సంవత్సరాలుగా పని చేస్తున్నామని తమకు పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల స్టేజ్ 11 బిల్లులు 10 తేదీలోగా చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్‌లోడింగ్ బిల్లు కాంట్రాక్టర్ పేరుతో కాకుండా తమ ఖాతాలో జమ చేయాలన్నారు. చదువు లేని హమాలీలకు బయోమెట్రిక్ నుంచి మినహాయించాలని కోరారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించారు.

విశాఖ-అరకు రోడ్డులో ఆక్రమణలు తొలగించండి

- ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణ పరిధిలోని విశాఖ-అరకు రోడ్డులో ఉన్న ఆక్రమణలను పోలీసుల సహకారంతో తక్షణమే తొలగించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అధికారులకు సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సతీష్, పంచాయతీరాజ్ ఏఈ సత్యనారాయణ, ఎన్‌హెచ్ఏ ఏఈఈ సురేష్, ఈవోపీఆర్డీ లక్ష్మి, పంచాయతీ ఈవో అనురాధలతో సోమవారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. విశాఖ-అరకు రోడ్డులో వరద నీరు నిల్వకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. ఇరువైపులా కాలువల నిర్మాణానికి ఇప్పటికే రూ.30లక్షలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. మరో రూ.65లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అడిగామని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి వ్యాపారులు, నాయకులు సహకరించాలని కోరారు. అధికారులు ఎవరి ఒత్తిడికి లొంగవద్దన్నారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టిలో పెట్టాలన్నారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, పార్టీ మండల అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, నాయకులు కొనదం మల్లేశ్వరరావు, కాపుగంటి వాసు పాల్గొన్నారు.

చంద్రబాబు సాయాన్ని మరువలేం

లక్కవరపుకోట, జూలై 28(ఆంధ్రజ్యోతి): తన కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అందించిన సాయాన్ని మరువలేమని నర్సంపేటకు చెందిన షేక్ మదీనా కన్నీటి పర్యాంతమయ్యారు. సోమవారం ఈయన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతులమీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని అందుకున్నారు. తన భార్య రెండు కిడ్నీలు పాడైపోయాయని, కిడ్నీ మార్పిడి జరిగిందని ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితిలో ముఖ్యమంత్రి రూ.2.56 లక్షల సాయం చేసి ఆదుకున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కేబీపీ రాంప్రసాద్, చెల్లంనాయుడు, చిన్నబ్బి పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

గజపతనగరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత షాపు లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా కో-ఆపరేటివ్ అధికారి పి.రమేష్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పీఏసీఎస్, శివశక్తి ఆగ్రో కెమికల్స్ షాపులను తనిఖీ చేశారు. 300 మెట్రిక్ టన్నుల యూరియా, 200 మెట్రిక్ టన్నుల డీఏపీ అందుబాటులో ఉంచామని చెప్పారు. సబ్ డివిజన్ కోఆపరేటివ్ అధికారి శైలజ, ఏడీఏ నిర్మలాజ్యోతి, ఏవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ● డెంకాడ: రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని తహసీల్దార్ ఎన్.రాజారావు, విజయనగరం సబ్ డివిజన్ ఏడీఏ నాగభూషణరావు వ్యాపారులకు సూచించారు. మండల కేంద్రంలోని సాయికృష్ణ రైతుమిత్ర గ్రూప్ ఎరువుల దుకాణం, రైతు సేవా కేంద్రాల్లోగల ఎరువులను నిల్వలను వారు సోమవారం పరిశీలించారు. ఏవో టి.సంగీత, ఏఈవో రామకోటి, వీఆర్వో కన్నయ్య పాల్గొన్నారు. ● దత్తిరాజేరు: ఎంపీఆర్‌కే ఎరువులను విక్రయించాలని మండల ప్రత్యేకాధికారి టి.విమలారాణి అన్నారు. చినకాద, దత్తిరాజేరు, మానాపురం, పోరలి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఆమె సోమవారం పరిశీలించారు. ఆమె వెంట ఏవో అనూరాధ ఉన్నారు. ● బొండపల్లి: ఎరువులు, పురుగుమందుల అమ్మకాల్లో నిబంధనలు అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని మండల ప్రత్యేక అధికారి ఎ.సల్మాన్‌రాజ్ హెచ్చరించారు. మండలంలో ఉన్న డీలర్ షాపులు, బొండపల్లి పీఏసీఎస్ కేంద్రం, దేవుపల్లి గ్రామంలోని ఎరువుల దుకాణాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. మండలంలో ఇప్పటివరకు 180 టన్నుల డీఏపీ, 130 టన్నుల యూరియా ఆయా కేంద్రాల్లో సిద్ధంగా ఉందని తెలిపారు. ఏవో పి.మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు. ● నెల్లిమర్ల: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో మండల ప్రత్యేకాధికారి మురళీమోహన్, ఏడీ కోటేశ్వరరావు, ఏవో శ్రీలక్ష్మిలు సోమవారం తనిఖీ చేశారు. ఏఈవో నాగరాజు పాల్గొన్నారు. ● శృంగవరపుకోట: పట్టణంలోని ఎరువుల దుకాణాలను మార్కెటింగ్ అసిస్టెంట్ డైరక్టర్ బి.రవికిరణ్, ఎస్.కోట వ్యవసాయ అధికారి రవీంద్రలు సోమవారం తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించవద్దని వ్యాపారులకు సూచించారు. ● రేగిడి: ఎరువుల విక్రయాల్లో తేడాలు సహించేది లేదని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ప్రైవేటు డీలర్లకు హెచ్చరించారు. ఉణుకూరు, ఉంగరాడ మెట్ట వద్ద గల ఎరువుల దుకాణాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ● లక్కవరపుకోట: ఎల్.కోట సీతారాంపురం వద్దగల ఎరువుల దుకాణాన్ని మండల ప్రత్యేకాధికారి యూఎం నాయుడు సోమవారం తనిఖీ చేశారు. ఏవో హరికృష్ణ, ఏఈవో ముత్యాలనాయుడులతో కలిసి తనిఖీలు చేపట్టారు.

ఈ దారిలో రోగులు వెళ్లేదెలా?

- అధ్వానంగా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి టీబీ, డయాలసిస్ యూనిట్, డీఎంహెచ్‌వో కార్యాలయాలకు వెళ్లే రోడ్డు

విజయనగరం టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి టీబీ, డయాలసిస్ యూనిట్, డీఎంహెచ్‌వో కార్యాలయాలకు వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా తయారయ్యింది. కిడ్నీ, క్షయ రోగులను తీసుకువెళ్లే వాహనాలు ఇదే రోడ్డు గుండా ప్రయాణిస్తున్నాయి. రోడ్డు గోతులమయంగా ఉండటంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులను ఈ రోడ్డుమీదుగా తీసుకుని వెళ్లలేక వారి బంధువులు నరకయాతన పడుతున్నారు. ఏమాత్రం వర్షం పడితే గుంతల్లో నీరుచేరి ఆ ప్రాంతమంతా బురదమయంగా మారుతోంది. ఈ గుంతల రోడ్డుపై రాకపోకలు సాగించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రోడ్డుమీద డీఎంహెచ్‌వో అధికారులు, సిబ్బంది కూడా రాకపోకలు సాగిస్తుంటారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని రోగులు కోరుతున్నారు.



టీబీ, డయాలసిస్ యూనిట్, డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లే దారి ఇలా..

వ్యాను ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

చీపురుపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుర్రేయవలస జంక్షన్ సమీపంలో సోమవారం లగేజ్ వ్యాను ఢీకొని కుప్పిలి శ్రీనివాసరావు(37) అనే వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుర్రేయవలస గ్రామానికి చెందిన కుప్పిలి శ్రీనివాసరావు, కుప్పిలి నీలబాబులు బైకుపై చీపురుపల్లి నుంచి పుర్రేయవలస వెళ్తున్నారు. జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న లగేజీ వ్యాను బలంగా ఢీకొట్టింది. బైక్‌పై వెనుకవైపున కూర్చున్న శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనం నడుపుతున్న నీలబాబుకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఒక కొడుకు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జంట హత్యల కేసులో వ్యక్తికి యావజ్జీవ శిక్ష

మక్కువ/ బెలగాం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండలంలోని చెముడు పంచాయతీ పాలికవలసలో 2018లో నమోదైన జంట హత్యల కేసు గిన్నిపల్లి సింహాద్రికు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు న్యాయాధికారి ఎస్.దామోదరరావు సోమవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మక్కువ మండలం పలికివలస గ్రామానికి చెందిన ఒమ్మి పైడిరాజు తన తల్లితండ్రులు ఒమ్మి సోములు, నారాయణమ్మలను అదే గ్రామానికి చెందిన గిన్నిపల్లి సింహాద్రి హత్య చేశాడని మక్కువ పోలీస్ స్టేషన్‌లో 2018లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో నిందితుడు సింహాద్రిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారన్నారు. సంబంధిత నేర శోధనకు కృషి చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

బైకు ఢీకొని మహిళకు గాయాలు

గంట్యాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. నరవ గ్రామానికి చెందిన ఎస్.దాలమ్మ సోమవారం సాయంత్రం పొలం పని ముగించుకుని ఇంటికి వస్తుండగా.. విజయనగరం నుంచి ఎస్.కోటకు వెళ్తున్న ద్విచక్ర వాహనం నరవ సమీపంలో కోనేరు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో దాలమ్మ తలకు బలమైన గాయమయ్యింది. వెంటనే 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

లక్కవరపుకోట, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందులూరు గ్రామానికి సమీపంలో పొలంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని చెప్పారు. మృతుడు నలుపు రంగు ఛాయ కలిగిఉండి.. నీలంరంగు టీషర్టు, గళ్ల లుంగీ కలిగిఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కోడి పందేలపై దాడి

సాలూరు రూరల్, జూలై28(ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి సమీపంలో తోటలో నిర్వహిస్తున్న కోడి పందేలపై సోమవారం సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి దాడి చేశారు. ఆరు కోడిపుంజులు, రూ.1500 నగదు సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ దాడిలో కొందరు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురు అరెస్టు

రాజాం రూరల్ జూలై 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని కొండంపేట సమీపంలో సోమవారం రాత్రి గంజాయి సేవిస్తున్న ఐదుగురిని రాజాం పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై టౌన్ సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు జూదరులు..

బొండపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలో రయింద్రం గ్రామం సమీపాన మామిడితోటలో జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. వారి నుంచి రూ.30,350 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్తు నాశనం

నెల్లిమర్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): నూతన విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.పి.పల్లవి సూచించారు. సోమవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల సంభవించే అనర్థాలను వివరించారు. దోషులకు కనీసం ఆరు నెలల నుంచి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ అండ్ డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఆర్ఎస్.వర్మ పాల్గొన్నారు.

'గురుదేవ' వ్యవస్థాపక సభ్యురాలు సుబ్బలక్ష్మి మృతి



సుబ్బలక్ష్మి (ఫైల్)

కొత్తవలస, జూలై 28(ఆంధ్రజ్యోతి): గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తల్లి, ట్రస్టు వ్యవస్థాపక సభ్యురాలు రాపర్తి సుబ్బలక్ష్మి (75) ఆదివారం రాత్రి మంగళపాలెం గ్రామంలో మృతిచెందారు. మంగళపాలెం గ్రామంలో సుమారు రూ.10కోట్లతో నిర్మించిన ఉప్పలపాటి విజయశ్రీ క్యాన్సర్ ఆసుపత్రి వ్యవస్థాపకులలో ఆమె ఒకరిగా నిలిచారు. దివ్యాంగుల కోసం కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఏర్పాటులోనూ, తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించే గురుదేవ ఆసుపత్రి ఏర్పాటులోనూ ఆమె ప్రముఖపాత్ర వహించారు. ప్రతినెల పేదలకు ఆమె ఉచితంగా బియ్యం, పింఛన్లు అందించే వారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంలో విశేష కృషి చేశారు.

రైల్వే స్టేషన్లలో తనిఖీలు

విజయనగరం క్రైం/ కొత్తవలస, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణా నియంత్రణే లక్ష్యంగా రైల్వేస్టేషన్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో జీఆర్పీ, ఈగల్ లోకల్ పోలీసు, ఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. డీజీపీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి కొరాపుట్, విశాఖపట్టణం పాసింజర్ రైల్లో తనిఖీలు నిర్వహించారు. అలాగే బొబ్బిలి, కొత్తవలస, విజయనగరం రైల్వే స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫాంలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ సీతారాం, జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు, ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్, సిబ్బంది పాల్గొన్నారు.


మంత్రులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి

భోగాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలను పూర్తిగా అమలు చేశామని చెబుతున్న రాష్ట్ర మంత్రులు ఆత్మ పరిశీలన చేసుకుని మాట్లాడాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. సోమవారం ఉప్పాడపేట గ్రామంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను పూర్తిగా అమలు చేశామని చెబుతున్న ముఖ్యమంత్రి, మంత్రులు.. అవి అమలయ్యాయో లేదో ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. హుద్‌హుద్ గృహాలకు సంబంధించి రికార్డుల్లో ఉన్న పేర్లకు, నివాసం ఉంటున్న వారికి పొంతన కుదరడం లేదన్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ, శివారెడ్డి, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చీపురుపల్లి రోడ్డు, బొబ్బిలి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫణీంద్రకుమార్, ఏఈ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రహదారి విస్తరణ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని చెప్పారు.

ప్రమాదకరంగా ఆటో ప్రయాణాలు



ప్రమాదకరంగా ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

భోగాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై ఆటోలు ప్రమాదకర రీతిలో రాకపోకలు సాగిస్తున్నాయి. పాఠశాలల విద్యార్థులను పరిమితికి మించి ఎక్కుంచుకుంటున్నారు. భారీ వాహనాలు నిరంతరం రాకపోకలు సాగించే జాతీయ రహదారిపై ఇలా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది. ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

50 శాతం కూడా పూర్తికాలే!

(5వ పేజీ తరువాయి)

చేయాల్సి ఉంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సందీప్‌కుమార్‌ను వివరణ కోరగా.. వచ్చేఏడాది మార్చి వరకు పనులకు గడువు పొడిగించారన్నారు. ప్రస్తుతం కొన్ని గ్రామాలకు జేజేఎం ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. మరికొన్ని గ్రామాలకు పైపులైన్, వాటర్ ట్యాంక్ పనులు చేపడుతున్నామన్నారు.

సరఫరా కావట్లే..

సాలూరు రూరల్: సాలూరు మండలంలో రూ. 27.53 కోట్లతో 231 జేజేఎం పనులు మంజూరు చేశారు. అయితే ఇప్పటి వరకు 57 పనులు ప్రారంభం కాలేదు. 171 పనులను పూర్తి చేశారు. మరో మూడు పనులు కొనసాగుతున్నాయి. కాగా పనులు పూర్తి చేసిన పలు గ్రామాల్లో పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదు. ఇందుకు వాటర్‌ట్యాంక్‌ల సామర్థ్యం పెంచాల్సి ఉంటుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

● బలిజిపేట: బలిజిపేటలో పలు వీధులకు జేజేఎం కుళాయిల ద్వారా తాగునీరు అందడం లేదు. మండలంలో 38 గ్రామాలుండగా.. 18 ప్రాంతాల్లో రూ.6.73 కోట్లతో పనులు మంజూరు చేశారు. కొన్ని గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. మరికొన్నిచోట్ల జేజేఎం పనులు చివరి దశకు చేరుకున్నాయి. కాగా పనులు పూర్తయిన గ్రామాల్లో తాగునీటి సరఫరా అందడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు.

కొనసా...గుతున్నాయ్..

కురుపాం: మండలంలో రూ.20.80కోట్లతో 177 పనులు మంజూరు కాగా ప్రస్తుతం 51 పనులు జరుగుతున్నాయి. గిరిజన గ్రామాల్లో పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, టెండర్ల ప్రక్రియలో మరికొన్ని ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వేణుగోపాల్ తెలిపారు.

అరకొరగా..

గరుగుబిల్లి: మండలానికి సంబంధించి 25 పంచాయతీలకు గాను 12 పంచాయతీల్లోనే అరకొరగా జేజేఎం పనులు నిర్వహించారు. 13 పంచాయతీల్లో పనులు ప్రారంభం కాలేదు. సుమారు రూ. 40 లక్షలు మేర బిల్లుల చెల్లింపులు కాకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచాయి. కొన్ని పంచాయతీల్లో కొళాయిలు ఏర్పాటు చేసినా తాగునీరందని పరిస్థితి నెలకొంది.

ఇంకా టెండర్ దశలోనే

జియ్యమ్మవలస: మండలంలో రూ. 535.70 లక్షలతో 29 చోట్ల జేజేఎం పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అయితే 9 చోట్ల పనులు పూర్తయినా ఇంకా ప్రజలకు తాగునీరు అందడం లేదు. మరో 20 చోట్ల ఇంకా టెండర్ దశలోనే పనులున్నాయి.

40 గ్రామాల్లో పూర్తి

పాచిపెంట: మండలంలోని 52 గ్రామాలకు జేజేఎం నిధులు మంజూరు కాగా 40 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన 12 గ్రామాల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. సుమారు రూ. 10 కోట్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామాంజనేయులు తెలిపారు.

మధ్యలో నిలిచిపోయాయ్..

పార్వతీపురం రూరల్: లక్ష్మీనారాయణపురం తదితర గ్రామాల్లో జేజేఎం పనులు నిలిచిపోయాయి. దీనివల్ల ఇంటింటికి కొళాయి కలగా మారిందని చెప్పవచ్చు. దీంతో గ్రామస్థులు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు.

● గుమ్మలక్ష్మీపురం: జేజేఎం కింద మండలంలో 96 గ్రామాల్లో పనులకు రూ.2కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. అయితే పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. బిల్లులు చెల్లింపులు కావడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రవీణ్ స్పష్టం చేశారు.

● మక్కువ: మండల కేంద్రంలో చేపట్టిన జలజీవన్‌మిషన్ పనులు అర్థాంతరంగా నిలిచాయి. సుమారు 450 పాయింట్ల వరకు కుళాయిలు బిగించి వదిలేశారు. ప్రస్తుతం అవి దిష్టిబొమ్మల్లా మిగిలాయి. వచ్చే ఏడాది మార్చి 31లోపు పనులు పూర్తిచేసి తాగునీరు అందజేస్తామని అధికారులు తెలియజేస్తున్నారు.

● వీరఘట్టం: మండలంలో 33 గ్రామాల్లో జేజేఎం పనులు జరుగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయినప్పటికీ పైపులు మాత్రం అమర్చలేదు. కొళాయిల నిర్మాణాలు కూడా పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కావ్యశ్రీని వివరణ కోరగా.. పనులు జరుగుతున్నాయన్నారు.

ఒక వ్యక్తి పేరిట 13 జిల్లాల్లో విద్యుత్ మీటర్లు

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు శ్రీను పేరు మీద ఉన్న మీటర్లు తొలగించినప్పటికీ ఆన్‌లైన్‌లో చూపిస్తుండడంతో రెండో విడత కూడా వారికి 'తల్లికి వందనం' కింద నగదు జమకాలేదు. దీంతో రమాదేవి సోమవారం కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు వచ్చింది. పథకం వర్తింపజేసి .. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది.

ఓఆర్‌ఎస్‌తో ఆరోగ్యం

(5వ పేజీ తరువాయి)

50 -100 ఎం.ఎల్, రెండు నుంచి పదేళ్లలోపు పిల్లలకు 100 - 200 ఎం.ఎల్, పెద్దలకు తగు పరిమాణంలో ఓఆర్ఎస్ తీసుకో వచ్చని వైద్యనిపుణులు సూచించారు. వేసవిలో ఎండల తీవ్రత నుంచి ఓఆర్ఎస్ ఎంతో ఉపశమనం ఇస్తుందని స్పష్టం చేశారు. డీహైడ్రేషన్‌తో ప్రమాదాలు, ఓఆర్ ఎస్ వినియోగంపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచాల్సి ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించండి

పాలకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేట్ వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రమాదాలను నివారించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవుట్ గేట్ వద్ద కల్వర్టుపై రోడ్డుకు ఇరు వైపులా వ్యాపారాలు సాగిస్తుండటం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బం దులు ఏర్పడుతున్నాయన్నారు. సాయంత్రం కళాశాలలు, పాఠశా లలు విడిచిపెట్టే సమయంలో ప్రధానంగా ఇక్కడ ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోం దన్నారు. కాంప్లెక్స్ నుంచి బయటకు వచ్చే బస్సులు వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు.

మొండివైఖరి విడనాడండి

పార్వతీపురం టౌన్, జూలై28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అద్దె బస్సుల యజ మానులు మొండి వైఖరి విడనాడాలని సీఐటీయూ నాయకులు బీవీరమణ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి డ్రైవర్ల వేతనాలు పెంచాలని కోరుతూ కలెక్టర్, ఆర్టీసీ అధికారులను వినతపత్రాలు అందజేశామన్నారు రోజు ఒక్కో డ్రైవర్ 12 గంటల నుంచి 18 గంటల వరకు విధులు నిర్వ హిస్తున్న వేతనాలను పెంచడంలో బస్సుల యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా చేయకపోతే త్వరలో సమ్మెకు వెళ్తామని వారు హెచ్చరించారు.



సిబ్బందికి సూచనలిస్తున్న పంచాయతీరాజ్ డీఈఈ

అభివృద్ధే కూటమి లక్ష్యం

పాచిపెంట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముస్ముందుకు సాగుతోందని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం పాచిపెంటలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికే పనిచేస్తోందన్నారు. 2019కు ముందు గ్రామ కంఠం గానీ, ప్రభుత్వ భూముల్లో గానీని ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటే అటువంటి కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా పట్టాలు మంజూరు చేస్తోందన్నారు. ఆయా స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. కల్లబొల్లి, మాయమాటలు చెప్పుకుంటూ కొంతమంది నాయకులు వస్తున్నారని, అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. పాచిపెంట పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. మండలంలోని పూడి నుంచి పనుకువలస బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 3 కోట్లు నిధులు మంజూరయ్యాయని మంత్రి సంధ్యారాణి తెలిపారు. అలాగే సరాయివలస గిరిజన బాలికల సంక్షేమ ఆశ్రమ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి రూ. 4.76 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గూడేపు యుగంధర్, సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పల్లేడ ఉమామహేశ్వరరావు, నాయకులు పిన్నింటి ఈశ్వరరావు, పూసర్ల నరసింగరావు, మతల బలరాం, కొత్తల పోలినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

పెన్షన్ మంజూరు చేయండి

●సాలూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడైన తన కుమారుడికి రూ.15 పింఛన్ మంజూరు చేయాలని పాచిపెంట మండలం కర్రివలస గ్రామానికి చెందిన బలివాడ కిశోర్‌కుమార్, సునీత దంపతులు కోరారు. సోమవారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వారు విన్నవించారు. 14 ఏళ్లుగా తమ కుమారుడు మంచానికే పరిమితమయ్యా డన్నారు. ప్రస్తుతం రూ.6వేలు వికలాంగ పింఛన్ వస్తున్నప్పటికీ ఇబ్బంది పడుతున్నామని వివరించారు. దీనిపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందిస్తూ సదరం ధ్రువపత్రంతో పాటు అన్ని విషయాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.15వేల పెన్షన్ వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కూటమి.. ప్రజల ప్రభుత్వం

గుమ్మలక్ష్మీపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి.. ప్రజల ప్రభుత్వమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని దిగువమండ, మల్లుగూడ, ఎగువమండ గ్రామాల్లో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్య క్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కడ్రక హైమావతి, నాయకులు కడ్రక మల్లేశ్వరరావు, హైమావతి, మండంగి భూషణరావు, నిమ్మక సింహాచలం, వెంపటాపు భారతి, శాంతకుమార్, అప్పలస్వామి, రామారావు, నిమ్మక భాస్కరరావు, చన్న, లింగరాజు, పాలక క్రాంతికుమార్, రామకృష్ణ, శరత్‌కుమార్, యువరాజ్, అజయ్, రమేశ్, బాలు అనీష్, కాంచన, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



తొలిఅడుగులో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

అన్నిచోట్లా పిచికారీ చేయండి

గుమ్మలక్ష్మీపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో అన్నిచోట్లా దోమల మందు పిచికారీ చేస్తేనే మలేరియా నుంచి పూర్తి రక్షణ లభిస్తుందని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. సోమవారం రేగిడి పీహెచ్‌పీ పరిధిలోని కానసింగి గ్రామంలో చేపడుతున్న పిచికారీ కార్యక్రమాన్ని జిల్లా కన్సల్టెంట్ రామచంద్రతో కలిసి ఆయన పరిశీలించారు. పిచికారీ విషయంలో ప్రజల సంపూర్ణ సహకారం అవసరమన్నారు. గ్రామంలో పిచికారీ చేయించేందుక చొరవ చూపిన ఎంఎల్‌హెచ్‌పీ చిన్నతల్లిని వారు అభినందించారు. ఈ సందర్భంగా మలేరియా పాజిటివ్ కేసుల స్థితిగతులను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణ, సబ్ యూనిట్ ఆఫీసర్ రాధాకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

9 వాహనాలపై కేసు నమోదు

బెలగాం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణ శివారు ప్రాంతం బెలగాంలో వాహనాలను ఆర్టీవో అధికారులు సోమవారం త నిఖీ చేశారు. జిల్లా రవాణాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పలు వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు. రోడ్డు నిబంధనలు అతిక్రమించిన 9 వాహనాలపై కేసు నమోదు చేసినట్లు ఆర్టీవో తెలిపారు. వాటిలో 4 ఆటోలను, 1 ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో పలువురు అసిస్టెంట్ ఎంవీఐ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనల హోరు

బెలగాం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు నిరసనలు తెలిపారు. జిల్లాలోని రైతులు ఎరువుల కొరత ఎదుర్కొంటున్నారని, రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయాలని రైతు సంఘం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.●గిరిజన ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల్లో గతంలో పని చేసిన వైద్య సిబ్బందిని విధుల్లోకి తీసుకుని గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని గిరిజన సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ కోరారు. ● జిల్లాలోని గిరిజన ఆదివాసీల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఎంఎల్) ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు

వీరఘట్టంతో సోలార్ వీధి దీపాలు

వీరఘట్టం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మేజర్ పంచాయ తీలో సోలార్ విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన రహదారిలో అమర్చారు. పంచాయతీలో సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఈవో కోటేశ్వరరావు తెలిపారు.

త్వరితగతిన పనులు చేపట్టండి

గరుగుబిల్లి, జూలై28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని పంచాయతీరాజ్ డీఈఈ ఎస్.వెంకటరావు ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవనాలు, నూతనంగా మంజూరైన పంచాయతీ భవన నిర్మాణాల పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి నివేదికలు అందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఏఈలు జి.గౌరీశంకరరావు వి.అఖిల్, ఏపీవో ఎం.గౌరీనాథ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎన్.ఈశ్వరరావుతో పాటు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా

పార్వతీపురం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం తోటపల్లి హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద ఇన్‌ఫిల్టర్ బావులు, మోటార్ల పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. తోటపల్లి ప్రాజెకు నిర్వహణలెనూ పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. జిల్లా కేంద్ర ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సరఫరా కోసం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుందని తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లానన్నారు.



పంప్‌హౌస్‌ను పరిశీలనలో ఎమ్మెల్యే విజయచంద్ర

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

పార్వతీపురం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం వెంకంపేటలోని టీడీపీ కా ర్యాలయంలో ఎమ్మెల్యే ప్రజదర్బార్ నిర్వహించారు. ఈ సం దర్భం గా ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సీతాన గరం మండలం లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ సుగర్‌ఫ్యాక్టరీలో సామగ్రి అపహరణ గురవుతోందని, వాటికి భద్రత కల్పించాలని కార్మికులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి స మస్యపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

పార్వతీపురం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదేశించారు. సోమవారం నర్సిపురం పం చాయతీ పరిధిలోని క్యాంప్ కార్యాలయంలో పార్వతీపురం, సీతా నగరం, బలిజిపేట మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యు లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందు లను అందుబాటులో ఉంచాలని సూచించారు.

పాఠశాల పరిశీలన

మక్కువ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాశీపట్నం ప్రాథమిక పాఠశాలను స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర బృందం సభ్యురాలు ఎ.పుణ్యశ్రీ సోమవారం పరిశీలించారు. పాఠశాలలో మరుగు దొడ్లను, రన్నింగ్ వాటర్, చేతుల పరిశుభ్రత గది, పాఠశాల ఆవరణలో చెత్త బుట్టలను నిశితంగా పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎన్.సూర్యనారాయణ, హెచ్‌ఎం శంబంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న పుణ్యశ్రీ

బీమా చేయించుకోండి

పార్వతీపురం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలకు యాజమానులు బీమా చేయించుకోవాలని పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మన్మథరావు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని బందలిప్పిలో ఈ నెల 27న ఎరువులను తిని మృతి చెందిన గొర్రెల యజమానులకు ఆయన పరామర్శించారు. ఈ సందరంగా గొర్రెల యజమానులతో మాట్లాడుతూ బీమా చేసుకోవడం వల్ల ఇప్పుడు సమస్య వచ్చిం దన్నారు. భవిష్యత్తులో అటువంటి సమస్య రాకుండా ప్రతి ఒక్కరూ మూగజీవాలకు బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన పరిష్కారం చూపండి

పార్వతీపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్, జేసీ శోభిక, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత 122 మంది నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలను 48 గంటల్లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌లో గరుగుబిల్లిలో తూర్పువైపు నివసిస్తున్న ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, మినీ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలని పద్మావతి తదితరులు కోరారు. ●కురుపాం మండలం సాకి గ్రామానికి వాటర్ ట్యాంక్, రక్షిత గోడ, సీసీ రోడ్లు వేయాలని ఎం.సోమేశ్వరరావు కోరారు. ●సాలూరు మండలం అంటివలస, రెమ్మవానివలసలో గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూమిని ప్రభుత్వం వారు సర్వే జరిపించి పట్టాలు ఇప్పించాలని సుశీల కోరారు.●రెండు నెలలుగా పింఛన్ అందడ లేదని సీతానగరం మండలం బూర్జి గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఈదిబిల్లి దిలీప్ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. బయోమెట్రిక్ నమోదు కాకపోవడమే కారణమని తెలిపాడు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్

సమస్యలను పరిష్కరించండి

సీతంపేట రూరల్, జూలై28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతులను తక్షణమే పరిష్కరించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని వినతులను స్వీకరించారు. మండలంలో తుంబలి గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కొండలరావు కోరారు. పవర్ టిల్లర్ ఇప్పించాలని సోమేశ్వరరావు, తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తించేలా చూడాలని త్రినాథరావు వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లంకిలో మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని గేదెల జనార్దనరావు విన్నవించారు. చీడిమానుగూడలో వరదగోడ నిర్మించాలని, పీఎం జన్‌మన్‌లో కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని నరేష్, గజపతి.. పీవోను కోరారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, టిడబ్ల్యూ ఈఈ కేవీఎస్ఎన్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, వెలుగు ఏపీడీలు శ్రీహరి, సన్యాసిరావు, ఏవో వాహిని, ఏఎంవో కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి పీవో

ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్ పోస్టర్ ఆవిష్కరణ

బెలగాం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సోమవారం కలెక్టరేట్‌లో ప్రీ మ్యారిటల్ కౌన్సెలింగ్ సెంటర్ పోస్టర్‌ను కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ.. వివాహం చేసుకునే జంటలకు పెళ్లికి ముందు కౌన్సెలింగ్ ఎంతో ఉప యోగపడుతుందన్నారు. పెళ్లి బంధం మరింత పటిష్ఠం చేస్తుందన్నారు. ఆరోగ్య కరమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్ర మంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో కె.హేమలత, ఐసీడీఎస్ డి.కనకదుర్గ, డీఎంహెచ్‌వో భాస్కరరావు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు

పార్వతీపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): యూరియా, డీఏపీకు బదులుగా నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నానో యూరియా, నానో డీఏపీను వా డా లని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ రైతులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కా ర్యాలయ ప్రాంగణంలో నానో యూరియా, నానో డీఏపీ విక్రయిస్తున్న కౌం టర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నానో టెక్నాలజీతో తయారైన యూరియా, డీఏపీను వాడడం వల్ల రైతులకు ఆర్థిక భారం తగ్గి మొక్కకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. తద్వారా అధిక ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, మన గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం

కొమరాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రి సమయంలో తరలిస్తున్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నట్టు కొమ రాడ తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణ తెలిపారు. సోమవారం రాత్రి చోళపదం నుంచి కొమరాడ వైపు రెండు నాటు బండ్లపై వస్తున్న కలపను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేశామన్నారు. అనంతరం రెండు నాటు బండ్లను కొమరాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

నారుమడిపై గడ్డి మందు కొట్టారని ఫిర్యాదు

సాలూరు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నారుమడిలో గడ్డిమందు కొట్టారనే ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని సాలూరు రూరల్ ఎస్.ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివకాల మే రకు.. కందుల పథంనకు చెందిన తీళ్ల సిద్ధాంతరావు తీనుసామంతవలసలో ఎకరానికి పైబడిన భూమిని సాగు చేస్తున్నారు. ఆ భూమి తమదంటూ ఇ టీవల ఎ.తిరుపతిరావుతో పాటు మరో నలుగురు సిద్ధాంతరావుతో వివాదానికి దిగారు. ఈ నేపథ్యంలో అదే భూమిలో సిద్ధాంతరావు నారుమడిని సిద్ధం చేశాడు. అయితే తనకు చెందిన నారుమడిపై తిరుపతిరావుతో పాటు మరో నలుగురు ఈ నెల 24న గడ్డిమందు కొట్టారని సిద్ధాంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.